సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం | 31 | మార్చి | 2024



ఆర్థికశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్తు

ఎకనామిక్స్ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ చైర్మన్ ఎల్.కె.మోహన్‌రావు తెలిపారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
రాయచోటి	6.30	4.55
రాజంపేట	6.31	4.54
పీలేరు	6.34	4.48
మదనపల్లె	6.33	4.56

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.228
రెండోరకం	రూ.130	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 95 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	389	389
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 33.100 కిలోలు

న్యూస్‌రీల్

రామయ్య సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ రంగమండపంలో హైకోర్టు న్యాయమూర్తి భానుమతి

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో వెలసిన మూలమూర్తులను శనివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తురాలు బీఎస్ భానుమతి దర్శించుకున్నారు. అంతకుముందు ఉదయం మానవ హక్కుల కమీషన్ చైర్మన్ సీతారామమూర్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయ ప్రదక్షణ చేసి గర్భాలయంలో ఉన్న మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో సేదతీరి, ఆలయ టీటీడీ అధికారులచే సత్కరించబడి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, సిద్దవటం జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్, రిటైర్డ్ జిల్లా జడ్జి రామకృష్ణ వీరి వెంట ఉన్నారు.

ల్యాబ్ అసిస్టెంట్ సస్పెన్షన్



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పీలేరురూరల్: కలికిరి జేఎన్‌టీయూలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఇటీవల ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కలికిరిలో టీడీపీ నాయకులతో కలసి ఆయన ప్రచారం చేస్తున్న దృశ్యాలు అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో అనంతపురం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలికిరి జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఏసీబీ వలలో వీఆర్వో



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ వీఆర్వో యల్లయ్య

కేవీపల్లె: మండలంలోని సొరకాయలపేట గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్వో యల్లయ్య శనివారం ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ గిరిధర్ కథనం మేరకు ... గోరంట్లపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లె వడ్డిపల్లెకు చెందిన రైతు మల్లయ్య భూములకు సంబంధించి రెండు సర్వేనెంబర్లు డి-పట్టా కరెక్షన్ చేయడానికి, మరో సర్వే నెంబరు అడంగల్ ఆన్‌లైన్ చేయడానికి గత నెలలో దరఖాస్తు చేసుకున్నాడు. రైతు కోరిన పనులు చేసి ఇవ్వడానికి వీఆర్వో యల్లయ్య రూ.9 వేలు లంచం కోరాడు. రైతు అంత ఇచ్చుకోలేను అని చెప్పడంతో చివరకు రూ. 5 వేలు ఇవ్వాలని కోరాడు. శనివారం రైతు మల్లయ్య రూ. 5 వేలు లంచం ఇస్తుండగా వీఆర్వో యల్లయ్యను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించి వీఆర్వో నుంచి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వీఆర్వోను నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

నేడు క్రీస్తు పునరుత్థాన మహోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో కడపలోని ఆరోగ్యమాత చర్చి

కడప కల్చరల్: గుడ్‌ఫ్రైడే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఈస్టర్ సండేను క్రైస్తవ లోకం నిర్వహించనుంది. తపస్కాలాన్ని పురస్కరించుకొని 40 రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఉపవాసాన్ని ఆచరించారు. ఎక్కువ సమయాన్ని ప్రార్థనతో గడిపారు. ఉన్న దానిలో దానధర్మాలు చేస్తూ దీక్షలో ఉన్నారు. శుభ శుక్రవారం తర్వాత వచ్చే పవిత్ర ఆదివారం నాడు, క్రీస్తు ప్రభువు మరణాన్ని జయించి మృత్యుంజయుడై సజీవునిగా లేచిన సందర్భంలో క్రైస్తవ లోకమంతా అమిత ఆనందముతో సంతోషంతో క్రీస్తు పునరుత్థాన పండుగను నిర్వహించుకుంటున్నారు.ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

పకడ్బందీ ఎన్నికలే లక్ష్యం

ఎన్నికల నగారా మోగిన క్షణం నుంచే అధికారులు ఎన్నికల ప్రక్రియలోకి దిగిపోయారు.జిల్లాలో శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా సమాయత్తమవుతున్నారు. చీమ చిటుక్కుమన్నా చాలు అప్రమత్తమవుతున్నారు. నలు దిక్కులా నిఘా పెట్టి నిరంతరం గస్తీ కాస్తున్నారు. పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

- సి-విజిల్, సువిధ యాప్‌ల ద్వారా ఫిర్యాదులు, అనుమతులు
- 226 మంది సెక్టోరల్ అధికారులు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. పోలింగ్‌కు ఇంకా 45 రోజులు మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సిబ్బందిని నియమించారు. పక్కనున్న పొరుగు రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి నగదు, మద్యం రాకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాలు, నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ చర్యలు తీసుకుంటున్నారు.

- ఈ నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు ఎన్నికల నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 15వేలకు పైగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల విధుల్లో కీలకమైన సెక్టోరల్ ఆఫీసర్లుగా 226 మందిని నియమించారు. సరాసరి ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరల్ ఆఫీసర్ చొప్పున నియమించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటరు జాబితాకు సంబంధించి ఫారం-7, 8 దరఖాస్తులను వంద శాతం పరిష్కరించారు. దీంతో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పూర్తి చేశారు. ఇక కేవలం కొత్త ఓట్లు నమోదు చేసుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది.

మొత్తం ఓటర్లు	1402796
పురుషులు	689337
మహిళలు	713323
థర్డ్ జెండర్లు	136
ఎన్నికల విధుల్లో	6వేల మంది
పోలింగ్ కేంద్రాలు	1607
చెక్‌పోస్టులు	15

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం..

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల కంట్రోలు రూము ఏర్పాటు చేశారు. దీనిలో పలు రకాల సేవలు, పరిశీలనలు చేస్తారు. సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు తీసుకుని 100 నిమిషాల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ సి-విజిల్ ద్వారా 624 ఫిర్యాదులు రాగా 602 ఫిర్యాదులను పరిష్కరించారు. ఇక రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే ముందు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్న నేపథ్యంలో.. నిబంధనలన్నీ పరిశీలించి సువిధ యాప్ ద్వారా అనుమతులు ఇస్తున్నారు. ఈ సేవలతో పాటు టోల్ ఫ్రీ నంబర్ 18004257090, వ్యయ కమిటీలు, స్వీప్, మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సింగిల్ విండో అనుమతులు వంటి సేవలు కంట్రోలు రూములో ఏర్పాటు చేశారు.

పోలింగ్‌కు 6వేల మంది..

జిల్లాలో 226 సెక్టోరల్ అధికారులను నియమించారు. వీరితో పాటు పార్లమెంటు పరిధిలో నియోజకవర్గానికి ఒక ఆర్ఓ చొప్పున 7 మంది, 31 మంది ఏఆర్‌ఓలు, 16 మంది జిల్లా స్థాయి నోడల్ అధికారులను ఏర్పాటు చేశారు. జిల్లాలో 3 నుంచి 4 చొప్పున 18 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సర్వేలెన్స్ బృందాలు 18, అకౌంటింగ్ బృందాలు 6, అసిస్టెంట్ అబ్జర్వర్లు 12 మందితో పాటు పోలింగ్ సిబ్బంది కోసం సుమారు 6వేల మందికి పైగా సిద్ధం చేశారు. వీరికి 30వ తేదిన శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించారు.

జిల్లాలో 15 చెక్‌పోస్టులు

ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు దొడ్డిదారిలో డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రాకుండా ఉండేలా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన శీకలబైలు, రామసముద్రం 4, బి.కొత్తకోట 2, పీటీఎంలో 2, తిరుపతి జిల్లా సరిహద్దులోని కోడూరు, నెల్లూరు జిల్లా సరిహద్దులోని చిట్వేలి, వైఎస్సార్ జిల్లా సరిహద్దులోని నందలూరు, గువ్వలచెరువు, కోనంపేట, సత్యసాయి జిల్లా సరిహద్దులోని వెలిగల్లు అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాలలో మొత్తం 15 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో ఐదుగురు చొప్పున పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ ఒక్కో షిఫ్ట్‌లో వంద నుంచి 200 చొప్పున వాహనాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రూ.79.54 లక్షల రూపాయల విలువైన నగదు, ఇతర వస్తువులను సీజ్ చేశారు. ఇందులో రూ.42.24 లక్షల మేర నగదు, రూ.17.89 లక్షల విలువైన లిక్కర్, రూ.1.40 లక్షల విలువైన గంజాయి. రూ.18 లక్షల విలువైన బంగారం, వెండి ఇతర వస్తువులను సీజ్ చేశారు. అలాగే ఎంసీసీ అతిక్రమణల కింద 10 ఎఫ్ఐఆర్ కేసులను నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 652 మంది రౌడీ షీటర్లను, వివిధ సంఘటనలలో నిందితులుగా ఉన్న మరో 1200 మందిని కలిపి 1852 మందిని బైండోవర్ చేశారు. మరి కొద్ది రోజుల్లో మరికొంత మందిని బైండోవర్ చేస్తారని పోలీసుల సమాచారం. గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎం.సిసి) గురించి అవగాహన కల్పిస్తున్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ దళాలతో స్థానిక పోలీసులను కలుపుకుని కవాతు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

నెలవారీ నివేదికలు తప్పనిసరి



వైద్యాధికారులతో సమీక్షను నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలో రిజిస్టర్ అయిన 117 స్కానింగ్ కేంద్రాల్లో నెలనెలా జరిగే గర్భిణుల స్కానింగ్, ఆసుపత్రులలో జరిగే గర్భస్రావాలు, ఫామ్ ఎఫ్ ఆన్‌లైన్ అప్‌డేషన్ తదితర నెలవారీ నివేదికలు ప్రతినెలా 2వ తేదిలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి పంపాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య ఆదేశాలు జారీ చేశారు. శనివారం తన కార్యాలయంలో ఆయన గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టం, మాతృమరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే సదరు కేంద్రాల నిర్వాహకులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని పెద్దమండెం, రాజంపేట, నందలూరు జరిగిన మాతృ మరణాలకు గల కారణాలు, మరణాల నియంత్రణకు ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాలపై కమిటీ సభ్యులు డాక్టర్ ఉషశ్రీ, వెంకటశివ, జీనత్‌బేగం, లక్ష్మి, డేవిడ్‌సుకు మార్‌లతో సమీక్షించారు. మాతృ మరణాలు సంభవించిన మండలాల వైద్యాధికారులు, మృతుల బంధువులతో చర్చించి మాతృమరణాల నియంత్రణకు తగు సలహాలు, సూచనలు యిచ్చారు. ఆయుష్మాన్ భారత్, బేటీ బచావో, బేటిపడావో, సేవ్‌డ గర్ల్ అండ్ చైల్డ్ పథకాలపై అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులకు గర్భిణీలకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలంటూ వైద్యాధికారులు, సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, 102 వాహన నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పదో తరగతి మూల్యాంకనం

- రాయచోటిలోని డైట్, బాలికల హైస్కూల్స్‌లో వసతుల కల్పన..
- 891 మంది సిబ్బంది నియామకం..

రాయచోటి : పదో తరగతి పరీక్షల మూల్యాంకనం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. రాయచోటి పట్టణంలోని రెండు హైస్కూల్స్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో పక్కాగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జరగనుంది.

ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు సుమారు లక్షా 50 వేల పేపర్లు మూల్యాంకనానికి రానున్నాయి. దీని కోసం జిల్లా వ్యాప్తంగా వెయ్యి మంది సిబ్బందిని నియమించారు. వీరిలో మూల్యాంకనం నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జామినర్లతో పాటు వాటిని పరిశీలించడానికి చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాశ్‌రెడ్డి క్యాంపు ఆఫీసర్‌గా, క్యాంపు ఆఫీసర్లుగా డిప్యూటీ డిఈవోలు శ్రీరామ్ పురుషోత్తం, నాగముణిరెడ్డిలు వ్యవహరించనున్నారు.

891 మంది టీచర్ల నియామకం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన రెండు లక్షల పేపర్లలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 90వేల లాంగ్వేజ్ పేపర్లు, డైట్ హైస్కూల్‌లో 60వేల మ్యాథ్స్, సోషియల్ పేపర్లు మూల్యాంకనం చేయనున్నారు. దీని కోసం 891 మంది సిబ్బందిని నియమించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం చేయనున్నారు.

పటిష్ట ఏర్పాట్లు



పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి నిర్వహించనున్నాం. దీనికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. మూల్యాంకనం విధులకు హాజరయ్యే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. మౌళిక వసతులు కల్పించాం. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కాబట్టి సిబ్బంది మార్కులు వేసే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటిస్తాం.

-శివ ప్రకాశ్‌రెడ్డి, డీఈవో, అన్నమయ్య జిల్లా

పీటీఎంలో చిరుతల సంచారం?

- హడలెత్తుతున్న రైతులు,పశు కాపరులు
- ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని పరుగులు తీసిన మామిడి రైతు



హైనా పాద ముద్రలు ..



గ్రామస్తుల చేతిలో హతమైన హైనాను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: స్థానిక బోడిగుట్ట సమీపంలో నాలుగు రోజుల నుంచి రెండు చిరుత పులుల సంచరిస్తున్నాయన్న అనుమానంతో రైతులు, పశు కాపరులు హడలెత్తిపోతున్నారు. రాత్రి వేళ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేందుకు బెంబేలెత్తి పోతున్నారు. చిరుత పులుల పాద ముద్రలు చూసిన రైతులు ఎటు నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని భయభ్రాంతులకు లోనవుతున్నారు. తాజాగా శనివారం బోడిగుట్ట వద్ద బూరగ రవనప్ప అనే రైతు మామిడి తోటలో నీళ్లను పారగడుతుండగా చెట్టుపై నుంచి ఒక్కసారిగా దూకిన చిరుతను చూసి ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని పరుగులు తీశాడు. స్థానికంగా ఉన్న ఓ ప్రజా ప్రతినిధి ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

చిరుత కాదు హైనా...అంటున్న అధికారులు

సామాజిక మాధ్యమాల ద్వారా ఫొటోలు చూసిన అటవీ శాఖ అధికారులు ఈ పాద ముద్రలు చిరుత పులులవి కావు హైనా పాద ముద్రలు అని నిర్ధారించారు. కాగా 2010 సెప్టెంబర్ 8న కూడా హైనా రెండు మండలాల్లో బీభత్సం సృష్టించింది. సుమారు 10 మందికి పైగా ప్రజలను దాడి చేసి తీవ్రంగా గాయపరచగా వీరిలో ఇద్దరు మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే. అనంతరం ఇదే మండలంలోని కుక్కలపల్లిలో గ్రామస్తుల చేతిలో హైనా హతమైంది. ఏది ఏమైనా గతంలో జరిగిన విషాద సంఘటనలు పునరావృతం కాకుండా అటవీ శాఖ అధికారులు ముందస్తుగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.


ఒళ్లంతా చెమటలు పట్టాయి



మామిడి చెట్లు కౌలుకు తీసుకున్నా. శనివారం ఉదయం చెట్లకు నీళ్లు కడుతుండగా చెట్టుపై ఉన్న చిరుత ఒక్కసారిగా కిందకు దూకి అటుగా వెళ్లడంతో నాకు ఒళ్లంతా చెమటలు పట్టాయి. ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని పరుగులు పెడుతూ ఊళ్లోకి వచ్చేశాను. -బి.రవనప్ప, మామిడి రైతు, పెద్దతిప్పసముద్రం

ఆయకట్టు.. ఆయువు పట్టు

- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- శరవేగంగా పనులు
- సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు
- టీడీపీ హయాంలో ప్రాజెక్టు పనులను విస్మరించిన వైనం



గండికోట ప్రాజెక్టు

కడప సిటీ : రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతేకాకుండా ప్రాజెక్టు అభివృద్ధి పనులకు నిధులను కూడా కేటాయించింది. పనులు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు బాగా పెరిగింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అంటే 2019 వరకు గండికోట అనుబంధ ప్రాజెక్టులైన జీకేఎల్ఐ, పీబీసీ, మైలవరం ద్వారా కేవలం 44,500 ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండేది. మైలవరం ప్రాజెక్టును కూడా ఎప్పుడూ పూర్తి స్థాయిలో నింపిన ఆనవాళ్లు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైలవరాన్ని ఆరు టీఎంసీలు, గండికోట ప్రాజెక్టును 26.5 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నింపడం జరిగింది. జల జీవనాడిగా పేరున్న గండికోట ప్రాజెక్టును అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేయడంతో ఆయకట్టు పెరిగేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. టీడీపీ ప్రభుత్వంలో ఉన్న ఆయకట్టు కంటే మూడింతలు పెరిగింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1.50 లక్షల ఎకరాలకు ఈ అనుబంధ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు మార్గం సుగమమైంది.

జీకేఎల్ఐ ద్వారా 30 వేల ఎకరాలకు నీరు

గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ (జీకేఎల్ఐ) కింద 47,500 ఎకరాల ఆయకట్టు కాగా, 30 వేల ఎకరాలకు ఆయకట్టు నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 85 కిలోమీటర్ల మేర పిల్ల కాలువలు తవ్వడంతో ఆయకట్టుకు నీళ్లందించేందుకు మార్గం ఏర్పడింది. పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 15 చెరువులను నింపి భూగర్భ జలాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో 2019 వరకు కేవలం 7500 ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండేది. నిర్మాణాత్మక పనులు చేపట్టకుండా విస్మరించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా..

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా 30 వేల ఎకరాల ఆయకట్టు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిస్ట్రిబ్యూటరీ ద్వారా 15 వేల ఎకరాలకు, వివిధ లిఫ్టుల ద్వారా 15 వేల ఎకరాలకు మొత్తం 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద 59,400 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఇందులో 30 వేల ఎకరాలకు సాగునీటిని ప్రభుత్వం అందించేందుకు కృషి చేసింది. అంతేకాకుండా కొండ ప్రాంతాల్లో ఉన్న మురారిచింతల, దిగువపల్లె, ఎర్రబల్లి, వెలిదండ్ల, కోమన్నూతల తదితర ప్రాంతాల్లోని భూములకు 14 లిఫ్టుల ద్వారా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే 15 గ్రామాలకు తాగునీరు అందించేందుకు అవకాశం ఏర్పడింది. భూగర్భజలాలు పెరగడం వల్ల బోరు బావుల్లో నీటిమట్టం మరింత పెరిగేందుకు దోహదపడింది. 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 7000 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కాలువల మరమ్మత్తులు, డిస్ట్రిబ్యూటరీ పనులు, అసంపూర్తిగా ఉన్న లిఫ్ట్ పనులను పూర్తి చేయడంతో ఆయకట్టు అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. 2020 నవంబరులో 10 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నింపిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది. డిస్ట్రిబ్యూటరీలకు రూ. 15 కోట్లు, డీప్ వాల్‌కు రూ. 25 కోట్లు, లిఫ్టుల నిర్మాణానికి రూ. 10 కోట్లు కలిపి మొత్తం రూ. 50 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టడంతో ఆయకట్టు పెరిగేందుకు వీలు కలిగింది.

మైలవరం కింద 75 వేల ఎకరాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మైలవరం ప్రాజెక్టు కింద ఆయకట్టు భారీగా పెరిగిందనడంలో సందేహం లేదు. టీడీపీ ప్రభుత్వంలో 2019 వరకు కేవలం ఈ ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉండగా, ఈ ప్రభుత్వ హయాంలో ఈ సంఖ్య 75 వేల ఎకరాలకు చేరింది. నిర్మాణాత్మక పనులకు రూ. 4 కోట్లు ఖర్చు చేశారు. కమలాపురం, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు తదితర నియోజకవర్గాలకు సాగు, తాగు నీటిని అందించేందుకు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతేకాకుండా నొస్సం బ్రాంచ్ కెనాల్ నుంచి టంగుటూరు బ్రాంచ్ కెనాల్, వెలువలి, గోపవరం సౌత్ కెనాల్, నార్త్ కెనాల్‌కు సంబంధించి పూడికతీత పనులు చేపట్టారు. మైలవరం నుంచి కేసీ కెనాల్ ద్వారా ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు 250 క్యూసెక్కుల నీటిని ఖరీఫ్‌లో 12 వేల ఎకరాలు ఎండిపోకుండా కాపాడారు. వెలవలి కెనాల్ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని తరలించి 5000 ఎకరాల ఆయకట్టు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టి దాదాపు మూడు నెలలపాటు నీళ్లిచ్చిన పరిస్థితి ఉంది.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా...

గండికోట అనుబంధ ప్రాజెక్టులకు సంబంధించి ఆయకట్టు బాగా పెరిగింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అనుబంధ ప్రాజెక్టులుగా ఉన్న సీబీఆర్, పీబీసీ, సీకేఎల్ఐ, మైలవరం నుంచి సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేవు.

విస్మరించిన టీడీపీ ప్రభుత్వం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన ప్రభుత్వ హయాంలో జలయజ్ఞం అనే పేరుతో జిల్లాలో ఉన్న ప్రాజెక్టుల అభివృద్ధి పనులను పరుగులు పెట్టించారు. ప్రత్యేక దృష్టి సారించి రైతులకు ప్రయోజనకరంగా పనులను చేపట్టారు. ఆయన మరణానంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం, ఇతర ప్రభుత్వాలుగానీ ప్రాజెక్టు అభివృద్ధి పనులను గాలికి వదిలేశారు. 2019లో అధికార పగ్గాలు చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తండ్రిబాటలో నడుస్తూ పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు శ్రద్ధ వహించారు. దీంతో గండికోట అనుబంధ ప్రాజెక్టులుగా ఉన్న మైలవరం, సీబీఆర్, జీకేఎల్ఐ, పీబీసీ వంటి వాటి కింద ఆయకట్టు భారీగా పెరిగింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 44,500 ఎకరాలు ఆయకట్టు ఉండగా, ఈ ప్రభుత్వ హయాంలో 2,37,400లకు పెరిగింది. ఇందులో 1.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు మార్గం సుగమమైంది.

క్లుప్తంగా

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



నక్కల మాలతి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట దళితవాడకు చెందిన నక్కల మాలతి (27) రెండు రోజుల నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఆమె భర్త రాము శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే ఒంటిమిట్ట పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ మధుసూదన్ రావు కోరారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



అరుణ్ కుమార్ (ఫైల్)

వాల్మీకిపురం : రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వాల్మీకిపురం పట్టణం పునుగుపల్లిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు..పునుగుపల్లికి చెందిన నరసింహులు కుమారుడు అరుణ్ కుమార్ (24) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పునుగుపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ప్రమాదంలో యువకుడి తల ఒకవైపు, శరీరం మరో వైపు చెల్లాచెదురుగా పడిపోయింది. ఈ విషాద సంఘటన చూసి మృతుడి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజంపేటలో రాజుకున్న అసంతృప్తి

- టీడీపీ టికెట్ సుగవాసికి ఇవ్వడంపై బత్యాల వర్గీయుల ఆగ్రహం
- బత్యాలను ఇండిపెండెంట్‌గా పోటీ చేయించే యోచన
- రేపు బలప్రదర్శనకు సిద్ధమవుతున్న వైనం



బత్యాల చెంగల్రాయుడు

రాజంపేట : రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని ఐదేళ్లుగా కాపాడుకుంటూ, పార్టీ క్యాడర్‌కు వెన్నుదన్నుగా నిలిచిన టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడుకు అధినేత చంద్రబాబునాయుడు టికెట్ విషయంలో మొండిచెయ్యి చూపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో బత్యాల వర్గీయులు, పార్టీ సీనియర్లు, కార్యకర్తలు, బలిజ సామాజికవర్గ నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఇప్పుడు తిరుగుబాటు చేయకపోతే రాజంపేట టీడీపీకి అభ్యర్థుల దిగుమతి సంస్కృతి కొనసాగుతూనే ఉంటుందని తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాడర్ నిర్ణయంపై బత్యాల ఆధారపడి ఉన్నారు.

ఇండిపెండెంట్‌గా బత్యాల?

రాయచోటికి చెందిన మాజీ జెడ్పీటీసీ సుగవాసి బాలసుబ్రమణ్యంను రాజంపేటలో పోటీ చేయించాలనే చంద్రబాబు నిర్ణయంపై బత్యాల వర్గీయులు నిరసన స్వరం వినిపిస్తున్నారు. బత్యాలకు టికెట్ ఇచ్చే వరకు అధిష్టానాన్ని వదిలేది లేదంటూ హెచ్చరిస్తున్నారు. అధిష్టానానికి తమ తడాఖా ఏమిటో చూపిస్తామంటూ టీడీపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా అయినా బత్యాల పోటీ చేయాల్సిందేనని శనివారం జరిగిన పార్టీ మీటింగ్‌లో ఇండిపెండెంట్ అంశాన్ని తమ్ముళ్లు లేవనెత్తారు. ఈ అవకాశం పోతే ఇక బత్యాలకు అవకాశమే రాదని బలంగా విశ్వసిస్తున్నారు. టీడీపీ టికెట్‌ను చంద్రబాబు రాయచోటి నేతలకు అమ్ముకున్నారని ఆ పార్టీ నేతలే బాహాటంగా విమర్శిస్తున్నారు.

బలప్రదర్శనకు సిద్ధమవుతున్న తమ్ముళ్లు..

రాయచోటి నేత సుగవాసి వద్దు.. బత్యాల ముద్దు అనే నినాదాన్ని పార్టీ క్యాడర్‌లో బలంగా తీసుకెళ్లేందుకు టీడీపీ వర్గీయులు సమాయత్తమవుతున్నారు. ఏప్రిల్ 1న ఉదయం 9గంటలకు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో బత్యాలకు మద్దతుగా టీడీపీ క్యాడర్ ర్యాలీ చేపట్టనుంది. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని బత్యాల బల ప్రదర్శనకు సన్నాహాలు జరుగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



వేముల : మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పులివెందులకు చెందిన ముగ్గురు వ్యక్తులు సొంత పని నిమిత్తం స్కార్పియోలో కడపకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి పులివెందులకు వస్తుండగా ఇ.కొత్తపల్లె సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో స్కార్పియో వాహనం పల్టీ కొడుతూ అవతలి రోడ్డువైపు నుంచి జొన్న చేనులోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు స్వల్పగాయాలు కావడంతో 108 ద్వారా చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పిల్లల చదువులకు ఇబ్బందులు తప్పాయి



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకంతో మా పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది. అంతే కాకుండా అనేక సంక్షేమ పథకాలతో మా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. పేదరికంతో బాధపడుతున్న మాకు గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వర్తించక చాలా ఇబ్బందులు పడ్డాం. మా కుమార్తె స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటోంది. అమ్మ ఒడి పథకం వర్తించింది. అలాగే నా పేరుతో ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరైంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇంతకంటే మేలు చేసే ప్రభుత్వం మరొకటి లేదు.

– కటిక కృష్ణవేణి, చాకలి వీధి, వేంపల్లె

సొంతింటికల నెరవేర్చిన సీఎం



నాకు వివాహమై దాదాపు 15 సంవత్సరాలు అయింది. ప్రభుత్వం నాకు ఇల్లు కానీ, ఇంటి స్థలం కానీ మంజూరు చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి, అందులోనే హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. నాకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను నెరవేర్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నేను కోరుకుంటున్నాను.

– గంగనపల్లి సావిత్రి, ఒంటిమిట్ట

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లల కోసం ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని అనంతరం పత్రాలు చేతికందాలంటే మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో మాకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ వలంటీర్‌కు తెలిపాము. ఒక్కరోజులోనే ఇంటి వద్దకు సర్టిఫికెట్లు తెచ్చి ఇచ్చారు. ప్రభుత్వ పాలన ఇంత సులభతరం చేసిన సీఎంకి రుణపడి ఉంటాం.

– ఎం. వెంకటమల్లమ్మ, వేపులబైలు

క్యాన్సర్‌పై ఉచిత అవగాహన

రాజంపేట టౌన్ : ప్రస్తుతం మారిన ఆహారపు అలవాట్ల వల్ల అనేక మంది క్యాన్సర్ వ్యాధి బారినపడుతున్నారని, సరైన సమయంలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని కడపకు చెందిన క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ గుండ్రాతి వంశీవిహారి తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7989596929 నంబర్‌కు ఫోన్ చేసి క్యాన్సర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు చికిత్సకు సంబంధించిన సలహాలను కూడా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



అదుపుతప్పి బోల్తాపడిన ట్రాక్టర్



ప్రమాదంలో మృతిచెందిన జయరామిరెడ్డి

లింగాల : లింగాల మండలం మురారిచింతల గ్రామ సమీపంలో ఈతాకు లోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లోడుపై కూర్చున్న దిగువపల్లె గ్రామానికి చెందిన జయరామిరెడ్డి(60) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ బీవీ కృష్ణయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం ముదిగుబ్బ ప్రాంతం నుంచి మండలంలోని ఎగువపల్లె గ్రామానికి ఈతాకు తీసుకుని వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఎండలు ఎక్కువగా ఉన్నందున అరటి మొక్కలకు నీడ ఉండేందుకు ఈతాకులను నీడగా కప్పుతారు. అరటి మొక్కలను రక్షించేందుకు ఇవి ఉపయోగపడతాయి. వాటిని ముదిగుబ్బ ప్రాంతంలో జయరామిరెడ్డి కొనుగోలు చేసి ఎగువపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లి లోడ్ చేసుకుని వస్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఈతాకు కింద కూరుకుపోయి జయరామిరెడ్డి ఊపిరి ఆడక మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల గెలుపునకు కృషిచేస్తాం



వైఎస్సార్‌సీపీలో చేరిన తమ్మినేని కుటుంబాలతో వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ తరపున కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని మాజీ కౌన్సిలర్ తమ్మినేని లక్ష్మీదేవి అన్నారు. శనివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవగుడి వర్గానికి చెందిన మాజీ కౌన్సిలర్ తమ్మినేని లక్ష్మీదేవి, తమ్మినేని శ్రీను, తమ్మినేని వెంకటేశ్‌తో పాటు మరో 50 కుటుంబాల వారిని ఎంపీ, ఎమ్మెల్యేలు పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసలాజం, కౌన్సిలర్ గౌరీనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో 30 కుటుంబాలు చేరిక

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డిల సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పడిగపాటి వెంకటశివారెడ్డితో పాటు 30 కుటుంబాల వారు ఉన్నారు.

ఎర్రగుంట్ల పట్టణంలో ఉన్న సుమారు 40 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో యాసిన్, ఆజమ్, ఆరిఫ్, నిరంజన్, దినకర్, ఆరిఫ్, కుమార్, మల్లి తదితరులు ఉన్నారు. వీరంతా అనుభాయ్‌గారి గఫూర్, బీఎస్ మాబువలి, ఏఎస్ మస్తాన్, ఎస్ షరీఫ్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

దువ్వూరు : దువ్వూరు ఎస్సీ కాలనీలో శనివారం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబుళరెడ్డి, సర్పంచ్ చెంగ్రాయుడు ఆధ్వర్యంలో వంద కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శెట్టిపల్లె నాగిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జేష్టాది ప్రభాకర్, చిటికెల కిరణ్‌కుమార్, మణి బ్రదర్స్, జక్కల బ్రదర్స్, పెన్నకంటి సోమయ్య, ఎర్రమల్లె పాములేటి, ముంతా సుధాకర్, జేష్టాది సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు

- టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలనుకోవడం జగన్ తప్పా..!
- డ్రైవర్లను అవమానించడం దారుణం
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్
- అంబేడ్కర్ విగ్రహం ఎదుట నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు దళిత ద్రోహి అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ కూడలిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలనుకోవడం సీఎం వైఎస్ జగన్ తప్పా అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతి ఒక్కరూ సమానమేనని, అందరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలన్నారు. పొట్టకూటి కోసం డ్రైవర్ వృత్తిని చేపడితే టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్టు ఇచ్చారు అంటూ అవహేళన చేయడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఆర్థికంగా ఎంఎల్‌ఏగా పోటీ చేసే స్థాయి లేకపోయినా.. వీరాంజనేయులులో ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావాన్ని గుర్తించి వైఎస్ జగన్ పిలిచి టిక్కెట్టు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. పేదలు, దళితులంటే చంద్రబాబుకు మొదటి నుంచి చాలా అలుసని, తరచూ తమను హేళన చేస్తూ మాట్లాడడం ఆయనకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు నారపురెడ్డి సుబ్బారెడ్డి, పి. జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు బండి ప్రసాద్, జాషువా, డాక్టర్ శివానాయక్, వేణుగోపాల్ నాయక్, కె. బాబు, త్యాగరాజు, ఇలియాస్, పవర్ అల్తాఫ్, కంచుపాటి బాబు, లక్ష్మీనారాయణ, చైతన్య, విజయకుమారి, తులశమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై 602 ఫిర్యాదులు పరిష్కారం

- రూ. 79.54 లక్షల విలువైన నగదు, లిక్కర్, ఇతర వస్తువులు సీజ్
- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి : జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 624 ఫిర్యాదులు అందగా అందులో 602 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఈ మేరకు శనివారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 624 ఫిర్యాదులు అందగా 602 ఫిర్యాదులను పరిష్కరించగా 22 ప్రగతిలో ఉన్నాయన్నారు.

ఫిర్యాదులు.. పరిష్కారాల వివరాలు

సి విజిల్ ద్వారా 96 ఫిర్యాదులు అందగా 96 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ప్రింట్ మీడియా మానిటరింగ్ యాప్, సీఈఓ ద్వారా 16 ఫిర్యాదులు అందగా 12 ఫిర్యాదులను పరిష్కరించగా, 4 ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. డిస్ట్రిక్ట్ కాల్ సెంటర్ ద్వారా 10 ఫిర్యాదులు అందగా 10 పరిష్కరించామన్నారు. ఎన్‌జీపీఎస్ (1950) ద్వారా 80 ఫిర్యాదులు అందగా, 80 పరిష్కరించామన్నారు. ఎన్‌జీఎస్‌పీ (సిటిజన్) యాప్ ద్వారా 337 ఫిర్యాదులు అందగా 328 పరిష్కరించామని, మిగిలిన 9 ప్రగతిలో ఉన్నాయన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా 30 ఫిర్యాదులు అందగా 22 పరిష్కరించగా 8 ప్రగతిలో ఉన్నాయని, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ. 79.54 లక్షల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేశామన్నారు. ఇందులో రూ. 42.24 లక్షల మేర నగదు, రూ. 17.89 లక్షల విలువైన లిక్కర్, రూ. 1.40 లక్షల విలువైన గంజాయి, రూ. 18 లక్షల విలువైన బంగారం, వెండి, ఇతర వస్తువులను సీజ్ చేశామని తెలిపారు. అలాగే ఎంసీసీ అతిక్రమణల కింద 7 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని ఎన్నికల అధికారి వివరించారు.

ఆర్థికశాస్త్ర అభ్యాసనంతో ఉజ్వల భవిష్యత్తు



40వ ఏపీ ఎకనామిక్స్ అసోసియేషన్ సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ ప్రొఫెసర్ ఎల్.కె.మోహన్‌రావు

మదనపల్లె : ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులతో సమానంగా ఎకనామిక్స్ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్.ఎల్.కె.మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ అసోసియేషన్ 40వ వార్షిక సమావేశం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జరిగింది. కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 4వ ఫైనాన్స్ కమిషన్ మెంబర్, ప్రొఫెసర్ కె.ఎం.నాయుడు, ఏయూ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డి.హరి నారాయణ, ఎస్వీయూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.దేవరాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికాభివృద్ధి, భవిష్యత్తులో రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి, ఆర్థికశాస్త్రం సబ్జెక్టును ఎలా వృద్ధి చేయాలనే విషయమై చర్చించారు. ఎస్ఐటీ, ఐఐటీ తదితర పెద్ద పెద్ద సంస్థలు బీటెక్ డిగ్రీలతో పాటుగా ఎకనామిక్స్ డిగ్రీలను ఆఫర్ చేస్తున్నాయన్నారు. వీటిని అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తుండటం మంచి పరిణామమన్నారు. దేశం ఆర్థికాభివృద్ధిలో ప్రపంచంలో ఐదోస్థానాన్ని కలిగి ఉందని, 2029కి మూడో స్థానంలో చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉచిత పథకాలతో ఆర్థికాభివృద్ధికి విఘాతం కలుగుతుందని, వీటికి పరిమితి ఉండాలన్నారు. రాష్ట్ర ఆదాయంలో 22శాతం వీటికి ఖర్చు చేసి, మిగిలినది ఉత్పాదక రంగాలపై వ్యయం చేయడం వల్ల అన్ని సెక్టార్‌లు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్రకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.శివరామయ్య, కోఆర్డినేటర్ ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధిలోని గొరిగెనూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీరుకట్టు రామసుబ్బమ్మ (50) అనే వివాహిత మహిళ విద్యుత్ షాక్‌కు గురై శనివారం రాత్రి మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గొరిగెనూరు గ్రామానికి చెందిన నీరుకట్టు రామసుబ్బమ్మ భర్త బాలు హమాలీ పనిచేసి జీవనం సాగించేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. రామసుబ్బమ్మ గ్రామంలో కూలి పనులు చేసుకునేది. శనివారం సాయంత్రం వ్యాపారం సుబ్బరాయుడు అనే వ్యక్తి ఇంట్లో బండలు తుడుస్తుండగా ఒక చేతితో తడిగుడ్డ మరో చేతితో అడ్డంగా ఉన్న కరెంట్ ఫ్లెక్స్‌బాక్స్‌ను పట్టుకుంది. అయితే ఫ్లెక్స్‌బాక్స్ వైరు దెబ్బతిని ఉండటంతో షాక్‌కు గురైంది. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.